ఇద్దరు రైతుల ఆత్మహత్య

- దిగుబడులు లేక.. అప్పులు తీర్చలేక
- ఖమ్మం, భూపాలపల్లి జిల్లాల్లో అన్నదాతల బలవన్మరణం

వెంకటేశ్వరరావు, కుమారస్వామి (ఫైల్)

ఎర్రుపాలెం/చిట్యాల, మార్చి 14: దిగుబడులు లేక.. అప్పుల భారం మోయలేక తీవ్ర మనస్తాపంతో ఇద్దరు రైతులు తనువు చాలించారు. ఈ విషాదకర ఘటనలు ఖమ్మం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో చోటుచేసుకున్నాయి. వివరాలు ఇలా.. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం మొలుగుమాడు గ్రామానికి చెందిన తోట వెంకటేశ్వరరావు (37) తనకున్న రెండున్నర ఎకరాలతోపాటు మరో ఐదు ఎకరాలను కౌలుకు తీసుకొని మిర్చి పంట వేశాడు. పంట సాగు తోపాటు కుటుంబ అవసరాల కోసం సుమారు రూ.21 లక్షలు అప్పు చేశాడు. ఈ ఏడాది మిర్చి పంటకు కూడా సరైన ధర లేకపోవడంతో ఈ మొత్తం అప్పులను తీర్చే మార్గం కానరాక మానసికంగా కుంగిపోయాడు. ఈ క్రమంలో ఈ నెల 7న ఉదయం పొలం వద్ద గడ్డిమందు తాగి ఇంటికి వచ్చాడు. మంచంపై పడుకొని అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు గుర్తించి వెంటనే ఖమ్మంలోని ప్రైవేటు దవాఖానకు తరలించారు. చికిత్స చేయించేందుకు ఆర్థిక స్థోమతలేక మరుసటి రోజు ప్రభుత్వ దవాఖానకు తీసుకొచ్చారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పీ వెంకటేశ్ తెలిపారు.

రామచంద్రాపురంలో కౌలు రైతు..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన సూర కుమారస్వామి(44) ఆరేండ్ల క్రితం సమీపంలోని గుంటూరుపల్లికి వలస వెళ్లాడు. అక్కడ నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. పంటలు సరిగా పండకపోవడంతో పెట్టుబడి కోసం తీసుకొచ్చిన అప్పు, నిరుడు కూతురి వివాహం కోసం చేసిన అప్పు కలిపి మొత్తం రూ.12 లక్షలు అయ్యింది. సాగు కలిసిరాకపోవడంతో చేసిన అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపంతో గత నెల 19న కౌలుకు తీసుకున్న చేను వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు గుర్తించి అతడిని వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ కుమారస్వామి శుక్రవారం మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ఈశ్వరయ్య తెలిపారు.

కరెంట్ షాక్‌తో ఇద్దరు రైతుల మృతి

- పంటకు నీరు పెడుతుండగా ఘటనలు
- ఉమ్మడి వరంగల్‌లో ఇద్దరు అన్నదాతల బలి

రవి (ఫైల్) సురేశ్ (ఫైల్)

రేగొండ/సంగెం, మార్చి 14 : పంటకు నీరందించే క్రమంలో కరెంట్ షాక్‌కు గురై ఇద్దరు రైతులు మృతి చెందారు. ఈ విషాదకర ఘటనలు ఉమ్మడి వరంగల్ జిల్లాలో చోటుచేసుకున్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గోరికొత్తపల్లి మండలం వెంకటేశ్వరపల్లెకు చెందిన ఇట్టవేన రవి (50)తనకున్న 4 ఎకరాల్లో మిర్చి, మక్క సాగుచేశాడు. బోరుబావిలో జలాలు అడుగంటడంతో పంటలు ఎండిపోతున్నాయి. గురువారం నుంచి ఎస్సారెస్పీ డీబీఎం-38 కాలువ ద్వారా సాగు నీరు విడుదల చేస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. అదే రోజు ఎస్సారెస్పీ కాలువపై కరెంట్ మోటర్ బిగించిన రవి పంట చేను వద్దకు పైపులు వేశాడు. అర్ధరాత్రి మోటర్ ఆన్ చేయగా నీళ్లు రాలేదు. కాలువలోకి దిగి పైపు వద్ద చెత్తాచెదారాన్ని తొలగిస్తుండగా విద్యుత్తు సరఫరాతో షాక్‌కు గురై మృతి చెందాడు.

వీఆర్ఎన్ తండాలో రైతు సురేశ్

సంగెం మండలం వీఆర్ఎన్ తండాకు చెందిన గుగులోత్ సురేశ్ (27) మక్క సాగు చేశాడు. శుక్రవారం చేనుకు నీళ్లు పెట్టేందుకు మోటర్ ఆన్‌చేయగా స్టార్ట్ కాలేదు. ఫ్యూజుల పరిశీలనకు స్టార్టర్ బాక్స్ తెరవగా షాక్‌కు గురయ్యాడు. పక్కనే ఉన్న రైతులు గమనించి దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు.

ధర లేక పసుపు రైతు పరేషాన్

- కర్షకుల గోడు వినని పసుపు బోర్డు
- పట్టించుకోని కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు
- గిట్టుబాటు ధర లేక అల్లాడుతున్న అన్నదాతలు
- శ్రమకు తగిన ఫలితం రాక ఆందోళన
- పసుపు సాగు చేయలేమంటున్న రైతులు

మద్దతు ధర ప్రకటించాలని నిజామాబాద్ బస్టాండ్ ఎదుట బైఠాయించిన పసుపు రైతులు (ఫైల్)

నిజామాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): పసుపు రైతుకు నష్టాలు తప్ప లాభమే లేకుండా పోతున్నది. ఈ సీజన్ ఆరంభం నుంచి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. పట్టించుకునే నాథుడే లేకపోవడంతో యార్కెట్‌లో దోపిడీ యథేచ్ఛగా సాగుతున్నది. దళారులకు సర్కారు పెద్దలే తెరవెనుక మద్దతుగా నిలుస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది. అందుకే పసుపు రైతులపై కనికరం చూపించకుండా ఇష్టారీతిన దోచుకుంటున్నట్టు సమాచారం. రైతుల గోడు వినేందుకు ఎవరూ రాకపోవడంతో ఓపిక నశించి ఇటీవల రోడ్డెక్కారు. కలెక్టర్‌తో చర్చించిన తర్వాతే ధర్నా విరమిస్తామని రైతులు భీష్మించడంతో కలెక్టర్ ఆదేశాలతో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ హుటాహుటిన రైతుల వద్దకు వచ్చి చర్చలు జరిపి ధర్నాను విరమింపజేశారు. మార్కెట్ కమిటీలో మూడు గంటల పాటు కూర్చుని కటాఫ్ ధరలను నిర్ణయించారు. పసుపు కొమ్ము రకానికి క్వింటాల్‌కు రూ.9,500, మండకు రూ.8 వేలకు తక్కువ కాకుండా కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ వ్యాపారులకు స్పష్టంచేశారు. మార్కెట్ కమిటీ పాలకవర్గం, అదనపు కలెక్టర్ సమక్షంలో జరిగిన ఈ ఒప్పందం గంటలు కూడా గడువక ముందే ఉల్లంఘనకు గురైంది. నాణ్యత, తేమ పేరుతో కొర్రీలు పెడుతూ ఇష్టారీతిన దోపిడీ చేస్తున్నారు. రూ.8 వేలకే కొమ్మును కొంటున్నారు. ఆ ధరకు అంగీకరిస్తే ఇవ్వండి లేదంటే కుదరదంటూ దబాయిస్తుండటంతో మార్కెట్‌లో నిరీక్షించలేని రైతులు.. ఎంతో కొంతకు అమ్మేసి ఇంటి దారి పడుతున్నారు. బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ గతంలో చెప్పినట్టుగా క్వింటాకు రూ.25 వేలు అమలైతే పసుపు రైతుకు ఢోకా ఉండదు. దుంపకుళ్లు బారిన పడి పసుపు దిగుబడి 15 క్వింటాళ్లకు పరిమితమవుతున్న తరుణంలో రైతుకు నష్టాలే మిగలనున్నాయి.

పాలకులకు పట్టింపేది?

పసుపు రైతుల గోడును పాలకులు పట్టించుకోవడం లేదు. ధర లేని సమయంలో ధైర్యం చెప్పాల్సిన ప్రజాప్రతినిధులు ఇటువైపు రావడం లేదు. నిజామాబాద్ రూరల్, ఆర్మూర్ ఎమ్మెల్యేలు భూపతిరెడ్డి, పైడి రాకేశ్‌రెడ్డి నియోజకవర్గాల్లో భారీగా పసుపు సాగవుతున్నది. వీరెవరూ పసుపు రైతుల బాధలను ఆలకించడం లేదు. బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి నేరుగా కలెక్టర్‌కు ఫోన్‌చేసి మార్కెట్‌లో దారుణ పరిస్థితులపై ఆరా తీశారు. వ్యాపారుల మోసాలపై దృష్టి సారించాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు చేస్తున్న మోసాలపైనా గళం వినిపించారు. ఎమ్మెల్సీ కవిత సైతం ఫిబ్రవరి 22న మార్కెట్ యార్డును సందర్శించి రైతులపక్షాన నిలబడ్డారు. పోరాటానికి సిద్ధం కావాల్సి ఉంటుందని హెచ్చరించారు. రైతుల మెరుపు ధర్నాపైనా స్పందించి పసుపు రైతులకు తానున్నానంటూ భరోసా కల్పించారు. ప్రతిపక్ష బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు స్పందించి రైతులకు ధైర్యం చెప్తుంటే కేంద్ర, రాష్ట్రాల్లో పాలకపక్షాలు మాత్రం పట్టించుకోవడం లేదని రైతులు మండిపడుతున్నారు. 2019, 2024లో తమ ఓట్లతో రెండుసార్లు ఎంపీగా గెలిచిన అర్వింద్ తమ మేలు కోసం పాటుపడటం లేదని రైతులు మండిపడుతున్నారు. పసుపు బోర్డు ఏర్పాటు చేసినట్టు చెప్తున్నా తమకు ఒనగూరిన ప్రయోజనం ఏమీలేదని రైతులు వాపోతున్నారు.

గిట్ల ఎప్పుడు లేదు..

మేము చాలా ఏండ్ల సంది పసుపు సాగు చేస్తున్నం. గింత దారుణ పరిస్థితులు ఎన్నడు సూడలే. పోయిన ఆదివారం మండ తీసుకొని మార్కెట్‌కొచ్చిన. ఐదారు రోజుల సంది తిప్పుతుండ్రు. ఎవరూ కొంటలేరు. ఏందని అడిగితే ధర తక్కువకు అడుగుతుండ్రు. మొన్నటిదాంక తొమ్మిది వేలు పోయింది. ఇప్పుడు ఏడు వేలు చెబుతుండ్రు. గీ ధరలు గిట్లనే ఉంటే గిట్టుబాటు కాదు. ముందటికి పసుపు పెట్టుడు అద్ద అని ఆలోచనజేస్తున్నం.

- రమావత్ మమత, మహిళా రైతు

ధర్నా చేసినా ఫలితం లేదు

గిట్టుబాటు ధర కోసం ధర్నా చేసినా ఫలితం లేదు. మొన్న కొంతమందికి రూ.11 వేలు ధర పెట్టిండ్రు. తరువాత రోజు రూ.2 వేలు తగ్గించిండ్రు. ఇట్లా మోసం చేస్తుండ్రనే ధర్నా జేసినం. ఏం ఫాయిదా. పట్టించుకునేటోళ్లు లేరు. రైతులను నిలువునా మోసం చేస్తుండ్రు. మండ మొన్నటిదాకా రూ.8 వేలు నుంచి రూ.9,500 పలికింది. ఇప్పుడు రూ.7,200కు తెచ్చిండ్రు.

- ముత్తెన్న, పసుపు రైతు, గోవిందపేట్



దెబ్బతిన్న కాకరవేణి ప్రాజెక్టు కాలువ

సీఎం ఇలాకాలో ఎండుతున్న పంటలు

- కాకరవేణి ప్రాజెక్టు నుంచి నీళ్లిస్తే ఒట్టు
- దెబ్బ తిన్న కాలువలు.. నీరందక రైతుల గగ్గోలు

వికారాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): సాగునీరు అందక సీఎం సొంత నియోజక వర్గంలో పంటలు ఎండుతున్నాయి. కొడంగల్ నియోజకవర్గం బొంరాస్‌పేట్ మండల పరిధిలోని కాకరవేణి ప్రాజెక్టులో నిండుగా నీరున్నప్పటికీ సాగు నీరివ్వని పరిస్థితులు నెలకొన్నాయి. కాకరవేణి ప్రాజెక్టు కింద 1,326 ఎకరాల ఆయకట్టు ఉన్నది. ప్రాజెక్టులో నీళ్లున్నా కాలువలు పూర్తిగా దెబ్బతినడంతో పంటలకు నీరిచ్చే పరిస్థితి లేకుండా పోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలువల మరమ్మతు మరిచింది. రైతులు విన్నవించినా పట్టించుకోలేదు. సీఎం సొంత నియోజకవర్గం కావడంతో మరమ్మతు పనులు చేసి సాగుకు నీళ్లిస్తారనే భరోసాతో రైతులు ఆయకట్టు కింద సాగు చేసిన వరి పంట ఎండుముఖం పట్టింది. పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. సాక్షాత్తు సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజక వర్గంలోనే ఇలాంటి పరిస్థితులు నెలకొనడంపై రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

వడ్లు కొనేదెట్ల!

మొదటిపేజీ తరువాయి...

ఇప్పుడు సివిల్ సప్లై అధికారులకు సవాల్‌గా మారింది.

మార్క్‌ఫెడ్ ద్వారా ఎన్‌సీడీసీ రుణానికి యత్నం

బ్యాంకుల్లో అప్పు పుట్టని నేపథ్యంలో సివిల్ సప్లై అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి పెట్టినట్టు తెలిసింది. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌సీడీసీ) రుణం కోసం ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది. ఈ ఎన్‌సీడీసీ కేవలం ఫెడరేషన్లకు మాత్రమే రుణం ఇస్తుంది. ఈ కారణంగా మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి చర్యలు మొదలు పెట్టినట్టు తెలిసింది. ఈ మేరకు రూ.8 వేల కోట్ల అప్పు కావాలంటూ లేఖ రాసినట్టు తెలిసింది. ఈ రుణం మంజూరైతే ధాన్యం కొనుగోళ్లు మొదలు పెట్టొచ్చనే ఆలోచనలో అధికారులు ఉన్నట్టు సమాచారం.

పెండింగ్‌లోనే రూ.400 కోట్ల బోనస్ పైసలు

ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామంటూ ఎన్నికల్లో హామీ ఇచ్చిన కాంగ్రెస్.. తీరా అధికారంలోకి వచ్చాక కేవలం సన్న ధాన్యానికి మాత్రమే ఇస్తామంటూ మాట తప్పింది. ఇందులో భాగంగానే గత వానకాలం సీజన్ నుంచి సన్న ధాన్యానికి బోన స్ ప్రకటించింది. వానకాలం సీజన్‌లో 24 లక్షల టన్నుల సన్నరకం వడ్లను కొనుగోలు చేసింది. రైతులకు బోనస్ కింద రూ.1,200 కోట్లు చెల్లించాల్సి ఉన్నది. వా టిలో ఇప్పటి వరకు సుమారు రూ.800 కో ట్లు మాత్రమే రైతులకు చెల్లించగా, ఇంకా రూ.400 కోట్లు బకాయి పెట్టినట్టు తెలిసిం ది. ధాన్యం కొనుగోళ్లు ముగిసి రెండు నెల లు అవుతున్నా బోనస్ బకాయిలు చెల్లించకపోవడం గమనార్హం. ఈ బోనస్ పైసల కోసం అధికారులు, బ్యాంకుల చుట్టూ తిరి గినా ప్రయోజనం లేకుండా పోయిందం టూ రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

యాసంగి పైసలు సకాలంలో అందేనా?

ఈ నేపథ్యంలో సర్కారు ఈ యాసంగిలో రైతులకు బోనస్ ఇస్తుందా? లేదా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ ఇస్తామన్నా, ఎప్పటికి ఇస్తుందోనని రైతులు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. దీంతోపాటు ఈ యాసంగి సీజన్‌లో దొడ్డు రకం ధాన్యం కొనుగోలుకూ అప్పు పుట్టే పరిస్థితి లేక, ఆ రైతులు కూడా బిల్లుల కోసం నెలల తరబడి వేచి చూడక తప్పదనే అనుమానాలు రైతుల్లో కలుగుతున్నాయి.

● ట్యాంకర్ నీటితోనే తడులు

వనపర్తి జిల్లా పెద్దగూడెం తండాకు చెందిన రైతు జాన్యా నాయక్ రెండున్నర ఎకరాల్లో వరి నాటాడు. మరో 20 రోజులు నీరందితే వరి చేను చేతికొస్తుంది. ఈ పొలానికి రెండు బోర్లుంటే, ఒకటి పూర్తిగా ఎండిపోగా.. మరో బోరులో నీటిమట్టం తగ్గింది. ఇప్పటివరకు ఎకరంన్నర పొలం వదిలేసిండు. మరో ఎకరా మాత్రమే పచ్చగా ఉన్నది. బోరులో నీరు తగ్గడంతో పంటను కాపాడుకునేందుకు నానా ఇబ్బందులు పడుతున్నాడు. రోజుకు రెండు ట్రిప్పులు ట్యాంకర్ నీటితో చేనును బతికించుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు.

- వనపర్తి, నమస్తే తెలంగాణ

● బావి ఎండుతున్నది.. గుండె మండుతున్నది

నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం బాడుగదిన్నెకు చెందిన రైతు బైరపోగు అశోక్‌కు ఆరెకరాల భూమి ఉన్నది. నాలుగెకరాల్లో కంది సాగు చేయగా.. నీళ్లులేక ఎండిపోయింది. మరో రెండు ఎకరాలు బీడు పెట్టాడు. మూడున్నర ఎకరాలు కౌలుకు తీసుకొన్నాడు. ఇందులో ఎకరంన్నరలో నువ్వులు, రెండెకరాల్లో వరి వేశాడు. భూగర్భజలాలు అడుగంటి బోరు నీరు సరిపోవడం లేదు. దీంతో పంటలు ఎండిపోయాయి. వేల రూపాయల పెట్టుబడి పెట్టగా కండ్ల ముందే పంటలు ఎండిపోవడంతో అశోక్ కన్నీరుమున్నీరవుతున్నాడు.

-కోడేరు

8 నెలలు.. ఇంకెన్నాళ్లు?

మొదటిపేజీ తరువాయి...

వర్షాలు సమృద్ధిగా కురవడంతో కర్ణాటక నుంచి కృష్ణానదికి భారీగా వరదలు వచ్చాయి. అయినా నీటిని ఒడిసిపట్టడంలో రేవంత్ సర్కారు నిర్లక్ష్యం కొట్టిచ్చినట్టు కనబడుతున్నది. ఆల్మట్టి, నారాయణపూర్, ప్రియదర్శిని జూరాల డ్యాం నుంచి భారీగా నీటిని దిగువకు వదిలారు. అలాగే తుంగభద్ర నదిపై కర్ణాటకలో ఉన్న టీబీ డ్యాం, సుంకేశుల డ్యాం నుంచి వచ్చిన వరదను వచ్చినట్టు దిగువకు విడుదల చేశారు. ఒక్క జూరాలకు 1,122 టీఎంసీల ఇన్‌ఫ్లో నమోదు కాగా.. 1,075 టీఎంసీలు దిగువకు వదిలారు. ఈ ఏడాది మొత్తం 82 రోజులు డ్యాం గేట్లు ఓపెన్ చేశారు. అయితే, ఈ నీటిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్న ఆరోపణలు ఉన్నాయి. ఎత్తిపోతల ద్వారా పంపింగ్ చేసిన నీటితో రిజర్వాయర్లను నింపారు. కానీ, అన్ని చెరువులు, కుంటలకు మళ్లించలేదు. దీంతో ఈసారి వేసవి ప్రారంభంలోనే చెరువుల్లో నీటిమట్టం తగ్గిపోయింది. ఇక పాలమూరు ప్రాజెక్టు 90% పనులు పూర్తయినా మిగితా పనులపై ప్రభుత్వం శ్రద్ధ చూపలేదు. ఎంజీకేఎల్ఐ, నెట్టెంపాడు మినహా మిగితా చిన్న ఎత్తిపోతలతో పెద్ద మొత్తంలో నీటిని ఎత్తిపోసుకోలేని దుస్థితి నెలకొన్నది.

అతిపెద్ద బాహుబలి మోటర్లు

వరద జలాలను ఒడిసిపట్టి పాలమూరు వసలను శాశ్వతంగా నివారించేందుకు దేశంలో ఎక్కడ వాడని సాంకేతిక పరిజ్ఞానంతో కేసీఆర్ ప్రభుత్వం పాలమూరు ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా మొత్తం ఐదు లిఫ్ట్‌లను నార్లాపూర్, ఏదుల, వట్టెం, కరివెన, ఉద్దండాపూర్ వద్ద ఏర్పాటుచేశారు. ఇక్కడ పంప్‌హౌస్‌లో 145 మెగావాట్ల బాహుబలి మోటర్లను నీటిని ఎత్తిపోసేందుకు ఉపయోగించారు. రేగుమాన్‌గడ్డ నుంచి మొదటి లిఫ్ట్ ద్వారా శ్రీశైలం బ్యాక్‌వాటర్‌ను ఎత్తిపోసేందుకు 9 బాహుబలి మోటర్లను ఏర్పాటుచేశారు. ఇందులో ఒకటి స్టాండ్‌బైగా ఉండగా, మిగిలిన 8 మోటర్లు ఒక్క రోజులో రెండు టీఎంసీల నీటిని ఎత్తిపోయగలవు. ఎదుల, వట్టెం వద్ద కూడా స్టాండ్‌బై మోటర్లతో కలిపి పది బహుబలి మోటర్లు ఉన్నాయి. తొమ్మిది మోటర్ల ద్వారా రోజుకు 2 టీఎంసీలకుపైగా నీటిని తోడివేయొచ్చు. అలాగే ఉద్దండాపూర్ వద్ద 5 మోటర్లు ఉన్నాయి. అన్ని చోట్ల దాదాపు 85 నుంచి 90% పనులు పూర్తయ్యాయి. దీంతో మొదటి లిఫ్ట్‌లో పంప్-1 నుంచి కేసీఆర్ నీటి పంపింగ్ ప్రారంభించారు. తర్వాత పనులు చేపట్టకుండా, నీటిని ఎత్తిపోయకుండా రేవంత్ సర్కారు నిర్లక్ష్యం వహించిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

10% పనులపై ప్రభుత్వం నిర్లక్ష్యం

దక్షిణ తెలంగాణకు సాగునీరు, జీహెచ్ఎంసీకి తాగునీటితోపాటు పరిశ్రమల అవసరాల కోసం రెండు నెలల పాటు కృష్ణానది వరద జలాలను వాడుకునేలా డిజైన్ చేసిన పాలమూరు ప్రాజెక్టుపై కాంగ్రెస్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. ఈ ఏడాది నదిలో పుష్కలంగా నీళ్లున్నా వాడుకోలేని దుస్థితి దాపురించింది. కేసీఆర్ తెచ్చిన ప్రాజెక్టు ద్వారా నీళ్లు వస్తే రైతులు బాగుపడుతారన్న అక్కసుతోనే పనులను పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. 120 టీఎంసీలను తీసుకోవడానికి అవకాశం ఉన్నా, ఆ వైపు ప్రభుత్వం ఆలోచన చేయలేదు. ఇప్పటికైనా నార్లాపూర్ రిజర్వాయర్ నుంచి కురుమూర్తిరాయ రిజర్వాయర్ వరకు నీటిని తోడుకునే అవకాశం ఉన్నదని నిపుణులు సూచిస్తున్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో అత్యంత కీలమైన మొదటి నార్లాపూర్ రిజర్వాయర్ నుంచి వట్టెం వరకు నదీ నీటిని తరలించడంలో ప్రధానంగా 10% పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నట్టు తెలుస్తున్నది. 3వ ప్యాకేజీలో 15 లక్షల క్యూబిక్ మీటర్ల పని పూర్తి చేస్తే వెంకటాద్రి రిజర్వాయర్ వరకు 1/3వ వంతు నీటిని నిల్వ చేసే అవకాశం ఉన్నది.

ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి

పాలమూరు మొదటి లిఫ్ట్‌లో నాలుగు మోటర్లు సిద్ధంగా ఉన్నా కృష్ణానీటిని ఎందుకు ఎత్తిపోయడం లేదో ప్రభుత్వం సమాధానం చెప్పాలి. మొదటి రిజర్వాయర్‌లో నీళ్లు నిల్వ ఉంటే కొల్లాపూర్ ప్రాంతానికి సాగు, తాగునీటికి ఢోకా ఉండదు. ఈ ప్రాంతానికి చెందిన వ్యక్తి సీఎంగా ఉన్నా, కొల్లాపూర్ వాసి మంత్రిగా ఉన్నా నీళ్లను లిఫ్ట్ చేయకుండా పంటలను ఎండబెట్టే కుట్ర చేస్తున్నారు. వెంటనే మొదటి లిఫ్ట్ నుంచి నీటిని పంపింగ్ ప్రారంభించాలి.

- బీరం హర్షవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

● ఆస్తిపన్ను కట్టలేదని తాగునీటి కనెక్షన్ కట్

నిర్మల్ జిల్లా భైంసాలోని రాహుల్‌నగర్‌లో ఆస్తి పన్ను కట్టలేదని మున్సిపల్ అధికారులు శుక్రవారం కాలనీకి తాగునీటి కనెక్షన్‌ను కట్ చేశారు. దీంతో స్థానికులు వాటర్ ట్యాంకు వద్ద నిరసనకు దిగారు. బీఆర్ఎస్ పాలనలో ఇలాంటి చర్యలు లేవని తెలిపారు. తాగునీటిని సరఫరా చేయకపోతే పెద్దఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. - భైంసా

● ఎండిన వెంగళ రావు ప్రాజెక్టు

భద్రాద్రి జిల్లా చండ్రుగొండ మండలం సీతాయిగూడెంలోని వెంగళరావు ప్రాజెక్టు ఎండిపోయింది. ప్రాజెక్టు అలుగుకు మరమ్మతులు చేయించకపోవడంతో నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పదేండ్లుగా పక్కకు పడేసిన ఆయిల్ ఇంజిన్ తీసుకొచ్చి మరమ్మతులు చేయించి ప్రాజెక్టులోని తూటికాడ ఉన్న కొద్దిపాటి నీటిని పొలాలకు పారించుకుంటున్న రైతు బొమ్మకంటి చెన్నారావు

- చండ్రుగొండ

నీటి కోసం పడిగాపులు కాస్తున్న రైతులు

కోట్‌పల్లి ప్రధాన కాలువకు జేసీబీతో అడ్డుకట్ట వేసిన రైతులు

నీళ్ల కోసం రైతుల మధ్య పంచాయితీ

- కోట్‌పల్లి ప్రాజెక్ట్ మెయిన్ కెనాల్‌కు దుగ్గాపూర్, కొండాపూర్ రైతుల అడ్డుకట్ట
- అభ్యంతరం తెలిపిన జనగాం గ్రామ రైతులు
- నీళ్లియ్యకుండా కొట్లాట పెడుతున్న సర్కార్

పెద్దేముల్, మార్చి 14 : వికారాబాద్ జిల్లాలోని ఒకే ఒక్క మధ్యతరహా ప్రాజెక్టు అయిన కోట్‌పల్లి నుంచి ఆయకట్టుకు సాగునీరందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది. సాగునీటిని అందించేందుకు కాలువలు, తూముల మరమ్మతులు చేయకపోవడంతో 9200 ఆయకట్టు ఉన్నా కేవలం 500 ఎకరాలకు మాత్రమే నీరందుతున్నది. ఇందులోనూ ఆయకట్టు గ్రామాల పరిధిలోని రైతుల మధ్య సాగునీటి కోసం వివాదం రేగింది. తూములు పాడవడం, కాలువలు దెబ్బతిన డంతో వచ్చే కొద్దిపాటి సాగునీటిని ఎవరికి వారు తరలించుకునేందుకు అడ్డుకట్ట వేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిపాటు కేవలం అంచనాలు తయారు చేయడం తప్ప మరమ్మతులు చేసేందుకు నిధులివ్వకుండా ఆయకట్టు కింది రైతుల మధ్య పంచాయితీ పెట్టింది. కోట్‌పల్లి ప్రాజెక్టు ప్రధాన కాలువల ద్వారా ఆయకట్టుకు అధికారులు నీటిని విడుదల చేసినా.. పర్యవేక్షించడంలో విఫలమయ్యారు. దెబ్బతిన్న కాలువల ద్వారా వచ్చే కొద్దిపాటి సాగునీరు తమ పొలాలకే రావాలని దుగ్గాపూర్, కొండాపూర్ గ్రామాల రైతులు ప్రధాన కాలువకు అడ్డుకట్ట వేసి, కేవలం లెఫ్ట్ కెనాల్‌కు మాత్రమే నీరు వెళ్లేలా ఏర్పాట్లు చేసుకున్నారు. అడ్డుకట్టను తొలగించాల్సిందేనని జనగాం రైతులు గొడవకు దిగారు. ప్రాజెక్టు మరమ్మతు పనులు చేయకుండా ప్రభుత్వం విస్మరించడం, మరోవైపు నీటిని వదిలిన ఇరిగేషన్ అధికారులు పర్యవేక్షించకపోవడంతో ఆయకట్టు గ్రామాల రైతుల మధ్య గొడవలకు దారితీసింది.